
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com



నిజామాబాద్
జిల్లా వార్తలు

1

శుక్రవారం 26 ఏప్రిల్ 2024





కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ ఎలిస్‌వజ్‌ఆర్

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన
ఎన్నికల అబ్జర్వర్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎలిస్‌వజ్‌ఆర్ గురువారం డిచ్‌పల్లి సీఎంసీలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బోధన్, బాల్కొండ, ఆర్మూర్, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కూడా సీఎంసీలో చేపట్టనున్నారని అధికారులు అబ్జర్వర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్, రిసివింగ్ సెంటర్‌లను, ఆయా సెంగ్మెంట్ల వారీగా లెక్కింపు గదులు, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీయంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాట్లు, వసతులను పరిశీలకులు ఎలిస్‌వజ్‌ఆర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా రిటర్నింగ్, కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నమని అధికారులు అబ్జర్వర్‌కు తెలిపారు. ఆమె వెంట జిల్లా కార్మిక శాఖ అధికారి యోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, మోప్మా పీడీ రాజేందర్, విజయేందర్‌రెడ్డి ఉన్నారు.



ప్రచార జోరు

- పార్లమెంట్ ఎన్నికల నామినేషన్లకు ముగిసిన గడువు
- ఊపందుకున్న ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారాలు
- రోడ్‌షోలు, భారీ బహిరంగ సభలకు నేతల ఏర్పాట్లు
- సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రులు హాజరయ్యే విధంగా అభ్యర్థుల కసరత్తు

నిజామాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలకు నామినేషన్లు ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంపై దృష్టి పెట్టారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రచార జోరు పెంచారు. రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహించడంతో పాటు ఓటర్ల మద్దతును కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రచారానికి గడువు 16రోజుల సమయమే ఉండడంతో మరింత జోరును పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రయత్నాలను చేస్తున్నారు. వివిధ వర్గాల మద్దతును కూడగట్టడంతో పాటు పార్లమెంట్‌లో అడుగు పెట్టేందుకు గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

ముగిసిన నామినేషన్ల గడువు

ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించారు. కాంగ్రెస్ తరపున టి. జీవన్‌రెడ్డి, బీజేపీ తరపున ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ తరపున బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ వేశారు. వీరు స్వయంగా వేయడంతో పాటు తమ మద్దతు దారుల ద్వారా మరో మూడు సెట్ల చొప్పున మొత్తం నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థులు, రిజిస్టర్డ్ పార్టీల తరఫున అభ్యర్థులు నామినేషన్లను వేశారు. నామినేషన్లను శుక్రవారం అధికారులు పరిశీలించనున్నారు. ఈనెల 29 వరకు నామినేషన్ విత్‌డ్రాలు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు.

ప్రచారాలపై అభ్యర్థుల నజర్

నామినేషన్‌ల ఘట్టం పూర్తికావడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ ప్రచారాలపై నజర్ పెట్టారు. నామినేషన్ వేసే సమయంలో భారీ బహిరంగ సభలను నిర్వహించిన ఈ పార్టీల అభ్యర్థులు మరింత జోరుగా ప్రచారం చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ వేసే సమయంలో కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సభకు పార్లమెంట్ పరిధిలోని నేతలంతా హాజరయ్యారు. పార్లమెంట్ నామినేషన్‌లు పూర్తయినందున మరో 16రోజుల పాటు ఈ ప్రచారాలను ఆ పార్టీ నేతలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్ చార్జిల ఆధ్వర్యంలో మండలాలు, మేజర్ గ్రామ కమిటీల పరిధిలో రోడ్డు షోలు నిర్వహించడంతో పాటు నియోజకవర్గానికి ఒక బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేరీతిలో ఈ బహిరంగ సభలకు మంత్రులు, ఏఐసీసీ నేతలతో పాటు మరోదఫా సీఎం పార్లమెంట్ పరిధిలో జరిగే సభకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఆర్మూర్ కానీ, కోరుట్లలో కానీ బహిరంగ సభను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండడం వల్ల అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. రోడ్‌షోలతో పాటు సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు

నామినేషన్ ఘట్టాన్ని పూర్తిచేసుకున్న బీజేపీ నేతలు కూడా మరింత జోష్‌గా ప్రచారాలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. సిట్టింగ్ స్థానాన్ని మరోదఫా నిలబెట్టుకునే విధంగా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఎన్నికల కోడ్ రాక ముందే పార్లమెంట్ పరిధిలోని జగిత్యాలలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఇంకా రెండు నెలల ముందే ఈ సభను నిర్వహించగా అప్పటి నుంచి పార్లమెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థి అర్వింద్ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. నామినేషన్ చివరి రోజు కూడా ఉత్తరాఖండ్ సీఎం బహిరంగ సభకు హాజరయ్యారు. ఇదే రీతిలో మరికొన్ని సభలను నిర్వహించడంతో పాటు కేంద్ర మంత్రులు ఈ సభలకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. వీరితో పాటు బీజేపీ జాతీయ నేతలు కూడా ప్రచారానికి వచ్చే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల పరిధిలో రోడ్డుషోలు, బహిరంగ సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.



పార్టీ పెద్దలు ప్రచారంలో పాల్గొనేందుకు ఏర్పాట్లు

ఈ రెండు పార్టీలకు దీటుగానే సభలు, రోడ్‌షోలు నిర్వహిస్తూనే ప్రచారం నిర్వహించేందుకు బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ సందర్భంగా పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రచారానికి ఇంకా 16రోజులు గడువు ఉండడంతో పార్టీకి చెందిన కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఇతర నేతలు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో వచ్చేనెల 5న జగిత్యాలలో జరిగే బహిరంగ సభలో, 6వతేదీన నిజామాబాద్‌లో జరిగే రోడ్‌షో, బహిరంగసభలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఎలాగైనా ఈ దఫా సీట్‌ను కైవసం చేసుకునే విధంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.





నగరంలో నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి



• బహిరంగ సభకు హాజరైన పార్టీ శ్రేణులు

ప్రపంచం మోదీ వైపు చూస్తోంది

- ఎన్నికల్లో ఆయనను చూసే ఓటువేయాలి
- ఇందూరులో మళ్లీ అర్వింద్‌ను గెలిపించాలి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే
- సభలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి

నిజామాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రపంచం మోదీ వైపు చూస్తోందని, మోదీని మూడోదఫా గెలిపిస్తే పసుపుబోర్డు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు కావాల్సిన అన్నిరకాల వసతులను సమకూరుస్తారని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి అన్నారు. గురువారం నగరానికి వచ్చిన ఆయన ఎంపీ అర్వింద్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పాత కలెక్టరేట్ ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో మోదీని చూసి ఓటువేయాలని, ఇందూరు నుంచి అర్వింద్‌ను మరోసారి గెలిపించాలని అన్నారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగానే ప్రధాని పసుపు బోర్డును ఏర్పాటు చేశారన్నారు. ఆయన తీసుకున్న నిర్ణయాల వల్లే పసుపు ధరలు కూడా పెరిగాయన్నారు. కాంగ్రెస్ అమలుకాని హామీలను ఇస్తుందన్నారు. ఈ దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరికి ఒకే విధమైన చట్టాలను అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రం ఉత్తరఖాండేనని ఆయన అన్నారు. ఆయన అన్ని మతాలకు ఈ చట్టాన్ని వర్తింపజేశామన్నారు. దేవ భూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్‌కు దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి భక్తులు వస్తారన్నారు. కేదారినాథ్, బద్రినాథ్, గంగోత్రి, యమునోత్రి, మానస సరోవర్ యాత్రలన్నీ అక్కడి నుంచే మొదలవుతాయన్నారు. ఐదువందల ఏళ్లనుంచి రామ మందిరం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కాంగ్రెస్ నేతలు రామ మందిరాన్ని పట్టించుకోలేదన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలోనే రామమందిర నిర్మాణం అయ్యిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతిమయ పార్టీలేనని ఆయన విమర్శించారు. ఈ రెండు పార్టీలు కుటుంబ పాలననే కొనసాగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ హయాంలో టూజీ స్కాం నుంచి నేషనల్ హెరాల్డ్ వరకు ఎన్నో కుంభకోణాలు జరిగాయన్నారు. అవినతికి కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ నిలిచిందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కూడా కుటుంబపాలనే కొనసాగిస్తుందన్నారు. కాళేశ్వరం నుంచి ఢిల్లీ లిక్కర్ స్కామ్ వరకు అవినీతిని ఆ పార్టీ ప్రోత్సహించిందన్నారు. ఈ రెండు పార్టీలకు ఓట్లు వేస్తే మరింత అవినీతి జరుగుతుందన్నారు.



సభావేదికపై ఉత్తరాఖండ్ సీఎంతో ధర్మపురి అర్వింద్

భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు..

బీజేపీ అభ్యర్థి ఎంపీ అర్వింద్ నామినేషన్ కార్యక్రమం సందర్భంగా పార్లమెంట్ పరిధిలో నుంచి నేతలు, కార్య కర్తలు భారీగా తరలివచ్చారు. నామినేషన్ తర్వాత జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పాత కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన ఈ బహిరంగ సభకు ఏడు నియోజకవర్గాల నుంచి నేతలు తరలివచ్చారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ హాజరుకావడంతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. గిరిరాజ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు బందోబస్తును కొనసాగించారు. అక్కడి నుంచి పాత కలెక్టరేట్ ఆవరణ వరకు రోడ్డువెంట పోలీసులను బందోబస్తు కోసం వినియోగించారు. బహిరంగ సభ వద్ద ఒక అదనపు ఎస్పీ, ట్రెయినీ ఐపీఎస్, ఇద్దరు ఏసీపీలతోపాటు సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఈ బందోబస్తులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా ఇన్‌చార్జి వెంకట రమణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ, మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, భూమన్న, లింగారెడ్డి, మల్లికార్జున్ రెడ్డితో పాటు జిల్లాకు చెందిన నేతలు పాల్గొన్నారు.

అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి కాంగ్రెస్..
: లక్ష్మణ్, రాజ్యసభ సభ్యుడు



రాష్ట్రంలో అమలుకాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ అన్నారు. రేవంత్ రెడ్డి నిత్యం హామీలను అమలు చేస్తామని ప్రకటిస్తున్నా ఇప్పటి వరకు చేయలేదన్నారు. బీఆర్ఎస్ వల్ల రాష్ట్రం నష్టపోయిందన్నారు. లిక్కర్ కేసులో అరెస్టు అయిన కవిత వల్ల చెడ్డపేరు వచ్చిందని ఆయన విమర్శించారు. రాష్ట్రం దెబ్బతిన్నా మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.

రాహుల్ గాంధీ ప్రధాని కాలేడు..
: అర్వింద్, బీజేపీ ఎంపీ అభ్యర్థి



సూర్యుడు తప్పదారి పడమట ఉదయించినా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాత్రం ప్రధాని కాలేడని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చిన రీతిలో హామీలను గుప్పించి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ ఇందూరుకు వచ్చే పసుపు బోర్డును ప్రకటించారన్నారు. పసుపు బోర్డును ఇందూరులోనే ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గ ఓటర్లు మరోసారి తనను గెలిపించి మోదీకి మద్దతు తెలుపాలని ఆయన కోరారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

- చివరి రోజు 28 నామినేషన్ల దాఖలు
- మొత్తం 90 సెట్ల నామినేషన్లు
- చివరి రోజు నామినేషన్ దాఖలు చేసిన అర్వింద్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25: నిజామాబాద్ లోక్‌సభ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. చివరిరోజు 28 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 42మంది అభ్యర్థులు 90 సెట్ల నామినేషన్లను దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. చివరిరోజు బీజేపీ అభ్యర్థిగా అర్వింద్ ధర్మపురి నాల్గవ సెట్ నామినేషన్ సమర్పించగా బీజేపీ రెబల్ అభ్యర్థిగా మీసాల శ్రీనివాస్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా గంట చరితరావు రెండవసెట్, నేషన లిస్ట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విఠల్ మాలావత్ రెండో సెట్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా సాయినిఖిల్ రెండో సెట్ నామినేషన్, బహుజన లెఫ్ట్ పార్టీ అభ్యర్థిగా అశోక్‌గౌడ్ అబ్బగోని రెండోసెట్, అన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎండీ మన్సూర్ రెండు సెట్ల నామినేషన్లు, స్వతంత్ర అభ్యర్థిగా ఎండీ జమీల్ రెండు సెట్ల నామినేషన్లు, విక్రమ్‌రెడ్డి రెండు సెట్లు, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా జి.సాయికృష్ణ మరోసెట్, స్వతంత్ర అభ్యర్థిగా కొత్తకొండ శక్తి ప్రసాద్ రెండో సెట్ నామినేషన్లు, బహుజన ముక్తిపార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్ నాల్గవ సెట్, స్వతంత్ర అభ్యర్థిగా పుప్పాల లింబాద్రి ఒకసెట్, రాష్ట్రీయ మానవ్ పార్టీ అభ్యర్థిగా బోగిరి పోశం, స్వతంత్ర అభ్యర్థిగా తూముకూరు జీవన్‌రెడ్డి రెండు సెట్లు, చెంచుల అశోక్ రెండు సెట్లు, గోపి చంద్రయ్య రెండు సెట్లు, రాపెల్లి శ్రీనివాస్ నాల్గవ సెట్, బీబీ నాయక్ రెండవ సెట్, వంతెడ్పుల మహాతేజలు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

42 మంది అభ్యర్థులు 90 సెట్ల నామినేషన్లు..

పార్లమెంట్ స్థానానికి మొత్తం 42 మంది అభ్యర్థులు 90 నామినేషన్లు దాఖలు చేశారు. రాపెల్లి సత్యనారాయణ (2సెట్లు), బూక్యానంద్ (3సెట్లు), రాగి అనిల్ (2సెట్లు), గోవర్ధన్ బాజిరెడ్డి (4సెట్లు), రాపెల్లి శ్రీనివాస్ (3సెట్లు), కండెల సుమన్ (4సెట్లు), అర్వింద్ ధర్మపురి (4సెట్లు), దేవతి శ్రీనివాస్ (4సెట్లు), ఆరె రాజేందర్ (3 సెట్లు), గంట చరితరావు (2సెట్లు), సయ్యద్ అస్గర్ (2సెట్లు), మిర్యాల్‌కర్ జయప్రకాశ్ (1), యుగందర్ గట్ల(2సెట్లు), పోతు అశోక్ (1), విఠల్ మాలావత్ (4సెట్లు), కాట్రాజి ప్రశాంత్ (2సెట్లు), కోటగిరి శ్రీనివాస్ (2సెట్లు), కొత్తకొండ శక్తిప్రసాద్ (2సెట్లు), బీబీనాయక్ (2సెట్లు), మొహమ్మద్ జమీల్ (3సెట్లు), అశోక్‌గౌడ్ (2సెట్లు), పోతు నవీన్ (2సెట్లు), సాయికృష్ణ మూర్తి (3సెట్లు), పోతు నాగార్జున (2సెట్లు), గోలి నగేష్ (1), ఎండీ షాహెద్‌ఖాన్ (2సెట్లు), కొండూరు గంగాధర్ (1), పానుగంటి రజితరాణి (1), ముత్యంరఘు (2సెట్లు), టి.జీవన్‌రెడ్డి (4సెట్లు), చెంచుల అశోక్ (2సెట్లు), దేశబోయిన లక్ష్మీనారాయణ (1), మొగిలిరాజ్‌కుమార్ (1), పాలమూరు సాయినిఖిల్ (2సెట్లు), మహమ్మద్ మన్సూర్ అలీ (2సెట్లు), వేముల విక్రమ్‌రెడ్డి (2సెట్లు), పుప్పాల లింబాద్రి (2సెట్లు), బేగరి పోశం (1), తూటుకూరి జీవన్‌రెడ్డి (1), గోపిచంద్రయ్య (2సెట్లు), మీసాల శ్రీనివాస్ (1), మహాతేజ (1)లు నామినేషన్లు దాఖలు చేశారు.

మలేరియా రహిత సమాజమే మన లక్ష్యం



జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

పెద్దబజార్, ఏప్రిల్ 25: మలేరియా రహిత సమాజమే మన లక్ష్యం అని డీఎంహెచ్‌వో సుదర్శనం అన్నారు. గురువారం నగరంలోని వినాయక్ నగర్‌లోగల పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని జాతీయ కీటకం జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మలేరియా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం డబ్ల్యూహెచ్‌వో ఇచ్చిన నినాదం మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేయడం జరిగిందన్నారు. మూడు దోమల ద్వారా ఐదు రకాల వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, మెదడువాపు, బోదకాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో గత సంవత్సరం నుంచి ఒక మలేరియా కేసు కూడా నమోదు కాలేదన్నారు. పరిసరాల శుభ్రత, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి లాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేను నిర్వహించడం ద్వారానే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అజ్మత్, జిల్లా ఆరోగ్య విద్య బోధకుడు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో వెంకట్‌రవి, శ్రీనివాస్, నటరాజ్, పర్యవేక్షకురాలు శాంతకుమారి, శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ఓటుహక్కుపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 25: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్‌లలో స్వీప్ నోడల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం ఎస్‌ఎల్‌ఎఫ్ సభ్యులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. మామిడిపల్లిలోని పాత గ్రామపంచాయతీ భవనం, పెర్కిట్‌లోని మహిళ భవనంలో ఐ ఓట్ ఫర్ షూర్‌లో భాగంగా మహిళలందరూ కుటుంబసభ్యులు ఓటు వేయడమేకాకుండా చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులను ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని ఎస్‌ఎల్‌ఎఫ్ గ్రూప్ సభ్యులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భూమేశ్వర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్, టీఎంసీ ఉదయశ్రీ, సీసీ రాజలింగం, ఎస్‌ఎల్‌ఎఫ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మపురి అర్వింద్

సీఎంకు ఓటునోటు కేసు భయం మొదలైంది

● బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్

పెద్దబజార్, ఏప్రిల్25: సీఎం రేవంత్‌రెడ్డికి ఓటుకు నోటు కేసు భయం మొదలైందని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ అన్నారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి స్పీచ్‌లలో మానసిక ఒత్తిడి కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు తీసివేసి ఎస్సీ ఎస్టీలకు ఇస్తామని అన్నారు. బీజేపీపై చార్జిషీట్లు వేసేస్థాయి రేవంత్‌రెడ్డికి లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, తదితరులున్నారు.

ప్రశ్నించే గొంతును గెలిపించాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, ఏప్రిల్25: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలంటే ప్రజల పక్షాన గొంతుకై ప్రశ్నించే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలిపించాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం ముప్కాల్ మండలంలోని నల్లూర్, నాగంపేట్ గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



కుస్తీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతకుంటలో కుస్తీపోటీలు

మోస్రా,ఏప్రిల్25: మండలంలోని చింతకుంట గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం కుస్తీ పోటీలు నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతారెడ్డి ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుండి మల్లయోధులు వచ్చి పోటీలో తలపడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై స్టేట్ సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ చేస్తున్న ఈజీఎస్ స్టేట్ బృందం

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 25: నిజామాబాద్ రూరల్ మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో రూరల్ ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో మధురిమ, ఎంపీవో మదురిమ సమక్షంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, విజిలెన్స్ అధికారి నారాయణ,అంబుడ్స్‌మెన్ అధికారి శ్రీనివాసరావులతో కూడిన ఎంజీఎన్ ఆర్‌జీఎస్ బృందం సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ కూలీల వివరాలు, పనుల వివరాల్లోని లోపాలను ప్రశ్నించారు. సిబ్బంది తయారుచేసిన రికార్డులను పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల హాజరును తీసుకోకుంఆనే పనులు నిర్వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనుల వివరాలు సైతం పూర్తి వివరాలను నివేదికలో రూపొందించలదేని ప్రశ్నించారు. ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీల భద్రతను కూడా పట్టించుకోలేదని, మౌళిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. పని ప్రదేశాల్లో కూలీలకు ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని ఎంపీడీవో మల్లేష్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో మధురిమ, ఎంపీవో మదురిమ, టీఏలు జోగేందర్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, ఉమ,తదితరులు పాల్గొన్నారు.

విజయ్ విద్యాసంస్థల అధినేత కాంగ్రెస్‌లో చేరిక

మాక్లూర్, ఏప్రిల్25:విజయ్‌రూరల్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, విద్యాసంస్థల అధినేత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పథకాలకు ఆకర్షితులై తాను పార్టీలో చేరానని ఆయన అన్నారు.

అంబంలో పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం

ఎడపల్లి, ఏప్రిల్ 25: ఎడపల్లి మండలంలోని అంబం గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ 3వ వార్షికోత్సవ వేడుకలను గురువారం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లి వార్షికోత్సవానికి వచ్చిర భుక్తలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిస్క గంగాప్రసాద్, ముదిరాజ్ సంఘ ప్రతినిదులు తదితరులు ఉన్నారు.

ప్రతి కూలీకి 2వందల రోజుల పనికల్పించాలి

● ప్రగతిశీల రైతు సంఘం నాయకుల డిమాండ్

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 25: ఉపాధిహామీ పథకంలో అర్హులైన వారందరికి జాబ్‌కార్డులు జారీచేస్తూ ప్రతీ కూలీలకు రెండువందల రోజుల పనికల్పించాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్, నాయకులు కిషన్ అశోక్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కోనాసముందర్ గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధీహామీ పథకం పనుల చోట్ల ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి కూలీలకు కల్పిస్తున్న వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పథకం ప్రారంభసమయంలో ఇచ్చిన జాబ్ కార్డులే తప్ప ఇప్పటివరకు ఇచ్చిన దాఖలాలు లేవని, కుటుంబాలు పెరుగుతున్నా జాబ్‌కార్డులు పెరగండంలేదని ఆరోపిస్తూ అర్హులైన కూలీలందరికి జాబ్‌యకార్డులు అందజేయాలని, వారంవారం కూలీడబ్బులు చెల్లించాలని, రెండువందల రోజులకు తగ్గకుండా పనికల్పిస్తూ కనీసం రూ.600 కూలీ గిట్టుబాటు ఆయ్యేలా చూడాలని,పని ప్రదేశంలో కూలీలకు నీడ,తాగునీటి సదుపాయాలు కల్పించాలని, ప్రథమచికిత్సనిమిత్తం కిట్లు అందుబాటులో ఉంచాలని, కూలీలకు పదిలక్షల ఇన్సూరెన్స్ అమలుపర్చాలని, వృద్ధ కూలీలకు రూ.5వేల జీవన బృతి కల్పించాలని, ఫీల్డ్‌అసిస్టెంట్‌కు రూ.20 వేల జీతాలు ఇస్తూ వారిని ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని, మెట్లకు 10వేల జీతం అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల డిమాండ్ల సాధనకై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

'పోలీసుల నిర్లక్ష్యం వల్లే తన భర్త చనిపోయాడు'

సిరికొండ ఏప్రిల్ 25: తన భర్త మరణానికి కారకులైన ఐదుగురు వ్యక్తుల అరెస్టు చేసే దాక తాను శవాన్ని ఇక్కడి నుంచి కదిలించేది లేదని గుర్రాల రవీందర్ భార్య శ్యామల శవాన్ని మల్కీ లతా ఇంటి ముందు వుంచి ఆందోళన చేశారు. సుమారు నాలుగు గంటల పాటు శవాన్ని మల్కీ లతా ఇంటి ముందర ఉంచి నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లె తన భర్త రవీందర్ చనిపోయాడని శ్యామల ఆరోపించింది. రెండు సార్లు తన భర్తను లతా తన అన్నదమ్ములు ఒక సారి ఇంట్లో నిద్రిస్తుండగా మరోక సారి కమ్యూనిస్టులమని చెప్పుకునే వ్యక్తుల అండదండలతో చితగ్గొట్టారని ఈ విషయంలో పోలీస్‌స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేసిన పెద్దగా స్పందించక పోవడం వల్లే ఆత్మహత్యా చేసుకున్నాడని శ్యామల ఆరోపించారు. భర్త ఆత్మహత్యాకు కారకులైన వారిని అరెస్టు చేసేదాక తాను ఆందోళ విరమించేది లేదని శ్యామల పోలీస్‌లకు తేల్చి చెప్పారు.డిచ్‌పల్లి సీఐ మల్లేశం, నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డి ఆందోళన చేస్తున్న బాదిత కుటుంబ సభ్యులకు నచ్చ చెప్పిన వారు వినిపించుకోలేదు. న్యాయం చేస్తామని ఏసీపీ చెప్పిన శ్యామల మాత్రం ఏమి న్యాయం చేస్తారు తన భర్తే చనిపోయాడు ఇంకేమి న్యాయం చేస్తారు, మీరు న్యాయం చేస్తామంటే మేము నమ్మాలా అని శ్యామ అధికారులను ప్రశ్నించడంతో వారు తేరు కోలేక పోయారు. తాము చెప్పిన ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేస్తేనే తాను తన భర్త అంత్యాక్రియలు చేయడానికి ఒప్పుకుంటానని చెప్పడంతో ఏసీపీ రాజవెంకటరెడ్డి మీ కుటుంబానికి న్యాయం చేస్తాను నన్ను నమ్మాలని సూచించడంతో ఆమె కాస్త మెత్తబడింది. ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశామని మిగిలిన ముగ్గురిని అరెస్టు చేస్తామని ఏసీపీ చెప్పడంతో శ్యామల, ఆమె బంధువులు కుటుంబ సభ్యులు రవీందర్ అంత్యాక్రియలు చేయడానికి అంగీకరించారు.శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశం చెప్పారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటలను జరుగకుండా డీచ్‌పల్లి సీఐ మల్లేశం, సిరికొండ ఎస్సై రమేష్ బందో బస్తు నిర్వహించారు.



నిందితురాలి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

రుద్రూరులో పడకేసిన పారిశుధ్యం

● డ్రైనేజీలు, మురికి కాలువల్లో చెత్తాచెదారం ● రోడ్లపై చెత్తాచెదారం ● పట్టించుకోని అధికారులు

రుద్రూరు, ఏప్రిల్ 25 : రుద్రూరు మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. కనీసం పక్షం రోజులకు ఒకసారి శుభ్రం చేయాల్సిన డ్రైనేజీలు, మురికి నీటి కాలువలను అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎక్కడికక్కడే నిండిపోతున్నాయి. దీంతో గ్రామాలు దుర్గంధ భరితమవుతు న్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామ పంచాయతీ సిబ్బంది కనీస సౌకర్యాలను కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు.రుద్రూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో చెత్తాచెదారం పూర్తిగా నిండిపోయింది. మురికి కాలువల పరిస్థితి అయితే మరింత దయనీయంగా మారింది. అసలే మండుతున్న ఎండలు.. ఆపై ఉక్కపోత.. చీకడి పండిందంటే చాలు దోమలు తీవ్రత మరింత ఎక్కువ అవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. రుద్రూరు మండల కేంద్రంలోని అంగడి బజార్, జవహర్‌నగర్ తదితర కాలనీలలో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ, మురికి కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు పేర్కొటున్నారు. రుద్రూరులోని 1, 4, 5, 12వ వార్డులతో పాటు తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ, మురికి కాలువలను శుభ్రం చేయకపోవడం వలన దోమలు, ఈగలు వృద్ది చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని



రుద్రూరులో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంగడి బజార్ ప్రాంతంలో జనావాసాల మధ్య డ్రైనేజీలలో చెత్తాచెదారం పేరుకుపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. డ్రైనేజీలో మురుగు, చెత్తాచెదారంతో విపరీతంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. డ్రైనేజీ, మురికి కాలువలకు ఇరువైపుల పిచ్చి మొక్కలు విపరీతంగా పెరుగుతున్నాయి. డ్రైనేజీ, మురికి కాలువల్లో స్ప్రేమందులను పిచికారి చేయాలని కోరుతున్నారు. ప్రజలు మలేరియా, డెంగీ వంటి ప్రమాదకర రోగాల బారిన పడే అకాశముందన్నారు.గ్రామ పంచాయితీ అధికారులు అక్కడక్కడ నామమాత్రంగా డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ డ్రైనేజీ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలోనే ఉండటం గమనార్హం. ఎన్నోమార్లు గ్రామ పంచాయితీలలో సమస్య గురించి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక వాసులు పేర్కొంటున్నారు. అదే విధంగా ప్రధాన రోడ్లపై చెత్త చెదారాన్ని తొలగించడంలో అధికారులు శ్రద్ధచూపడం లేదు. పన్నులను వసూలు చేయడంతో చూపించే శ్రద్ధను గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపైప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● డ్రైనేజీ సైడ్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టాలి

రుద్రూరులోని జవహర్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సైడ్‌వాల్ కూలిపోయింది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సైడ్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానిక కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

డ్రైనేజీలలోని చెత్తాచెదారాన్ని తొలగించాలి



డ్రైనేజీలలో చెత్తచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది.ఎన్నిమార్లు గ్రామ పంచాయతీలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని డ్రైనేజీలను శుభ్రం చేయాలి.

- మహ్మద్ అబ్రార్ ఖాద్రి, స్థానికుడు, రుద్రూరు

సమస్యలను పరిష్కరిస్తాం

ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో చూసి మురికి కాలువలు, డ్రైనేజీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

- గంగాధర్, పంచాయితీ సెక్రటరీ, రుద్రూరు

వృద్ధులపై దాడి నిందితులను పట్టుకుంటాం

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్



శేషాద్రిఫారంలో విచారణ జరుపుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

కోటగిరి,ఏప్రిల్25: ఒంటరిగా ఉన్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దాడి చేసి వారి ఒంటిపై ఉన్న బంగారు నగలను అపహరించుకుపోయిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. పొతంగల్ మండలంలోని రంగనాయకుల పారం, శేషాద్రి పారం గ్రామాలలో వృద్ధులపై దాడి చేసిన ఇళ్లను గురువారం బోధన్ ఏసీపీ పరిశీలించారు. ఇంటి పరిసరాలను పరిశీలించడంతో పాటు స్థానికులను విచారించారు. రెండు రోజుల క్రితం రంగనాయకుల పారంలో భార్గవి దేవి అనే వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు నగలను అపహరించుకుపోయిన విషయం విదితమే. తీవ్రగాయాలపాలైన వృద్ధురాలు బోధన్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నెల రోజుల క్రితం శేషాద్రి పారం గ్రామంలోనూ ఇలాంటి ఘటననే చోటు చేసుకుంది. ఒంటరిగా ఉన్న రాధాకృష్ణమూర్తి అనే వృద్ధుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. అకస్మారక స్థితిలో ఉన్న రాధా కృష్ణను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. నెల రోజుల్లో వృద్ధులను టార్గెట్ చేస్తూ వరుస చోరీలను పాల్పడుతున్న నిందితులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టినట్లు ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. ప్రతీ ఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏసీపీ వెంట రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి, వర్ని ఎస్ఐ కృష్ణ కుమార్ తదితరులున్నారు.

ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్



కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

కోటగిరి,ఏప్రిల్25: గత పదేళ్లలలో ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రైవేటుపరం చేసిందని ఈ ఎన్నికలలో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఎన్నికలలో బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. డిల్లీ మద్యం వ్యాపారి ఎన్నికల బాండ్‌ల రూపంలో బీజేపీకి రూ.500కోట్లు చెల్లించారని గుర్తు చేశారు. గత 67ఏళ్లలలో 14మంది ప్రధాన మంత్రులు 55లక్షల కోట్ల అప్పులు చేసి ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మోడీ హయాంలో రూ.113కోట్ల లక్షల అప్పులు చేసి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేశారన్నారు. బీజేపీ ఎన్నికల సమయంలో ప్రతీ ఒక్కరికి రూ.15లక్షల ఖర్చు వేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. సంవత్సరానికి 2లక్షల ఉద్యోగాల హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. పదేళ్లలో దేశ సంపదను ఖర్చు చేసి విదేశీ యాత్రలు చేయడం తప్ప దేశానికి మోదీ చేసిందేమి లేదన్నారు. ఈ ఎన్నికలలో బీజేపీని ఇంటికి పంపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ నాయకులు దుబాస్ రాములు, మండల కార్యదర్శి విఠల్ గౌడ్, గంగాధర్, సాయిలు, మల్కయ్య తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రాజ్‌కుమార్

ముప్కాల్, ఏప్రిల్25: ముప్కాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సామ పద్మ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఇందులో భాగంగా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఆయాశాఖలకు చెందిన అధికారులు వారి వాణి వినిపించారు.ఈకార్యక్రమంలో ఎంపీఈవో మహమ్మద్, ముజాఫరోద్దిన్, ఎంపీడీవో భరత్‌చంద్ర, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీతో నిజామాబాద్ తరలివెళ్లిన బీజేపీ కార్యకర్తలు

నవీపేట,ఏప్రిల్25: మండల కేంద్రం నుండి నిజామాబాద్‌కు గురువారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో తరలివెళ్లారు. బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అరవింద్ నామినేషన్ సందర్భంగా పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో తరలివెళ్లారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సరిన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి, ఏప్రిల్25: నిజామాబాద్‌లో గురువారం బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద నామినేషన్ వేసిన సందర్భంగా జక్రాన్ పల్లి మండల బీజేపీ నాయకులు తరలివెళ్ళారు. మొదట జక్రాన్‌పల్లి నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీపై నిజామాబాద్‌కు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నాయకులు పోశన్న, రాజేందర్, రాజారెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

పొతంగల్‌లో ఇంటింటికి బీజేపీ ప్రచారం

కోటగిరి,ఏప్రిల్25: పొతంగల్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బుధవారం బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ బీజేపీకే ఓటు వేయాలని కోరారు. దేశం ప్రగతి బాటలో పయనించాలంటే నరేంద్ర మోడీ మరోమారు ప్రధాని కావాల్సి ఉందన్నారు. బీబీపాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భజరంగ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో రేణుక ఎల్లమ్మ ఆలయవార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 25: కమ్మర్‌పల్లి శ్రీగిరిగుట్ట పై కొలువుదీరిన గౌడ కులస్తుల ఆరాధ్య దైవం రేణుక ఎల్లమ్మ ఆలయ ఐదవ వార్షికోత్స వేడుకలు ఈ నెల 26 నుండి నేలాఖరువరకు నిర్వహింపబడతాయని ఆలయ అభివృద్ధి కమిటి, గ్రామ గౌడసంఘం, యువజన సంఘాల సభ్యులు తెలిపారు. ఈ నెల 26 న శుక్రవారం జోగెత్తుడు కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 27 న శనివారం అన్నదానం, 28 న ఆదివారం పోచమ్మ బోనాల ఊరేగింపు, 29 న సోమవారం గంగాకటమయ్య బోనాలుపుట్ట, నందు కార్యక్రమాలు ఉంటాయని 30 న ఉదయం 7 గంటలకు ఎల్లమ్మ బోనాలు, ఆలయంలో ప్రత్యే పూజా కార్యక్రమాలు నిర్వహింపబడతాయని భక్తులు పెద్ద సంఖ్యలో బోనాల ఊరేగింపులో పాల్గొనాలని కోరారు. కాగా ఆలయంలో జరిగే వార్షికోత్సవం, పూజా, అన్నదాన కార్యక్రమాలకు భారీగా భక్తులు తరలివచ్చి దేవి కృపకు పాత్రులు కవాలని గౌడ కులసంఘ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు కోరారు.

ధర్మారం వాసికి ఎల్‌వోసీ అందజేత

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25: మండలంలోని ధర్మారం(బి)కి చెందిన డి.కృష్ణ ఆనారోగ్యం గురకావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి స్పందించి బాధితుడికి చికిత్స కోసం రూ.2.40 లక్షల ఎల్‌వోసీ అంద జేశారు. ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

డొంకేశ్వర్ ఏప్రిల్ 25: అనారోగ్యంతో బాధపడుతు హైదరాబాద్ నిమ్స్ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌కు రూ.2లక్షల ఎల్ వోసీ మంజూరైంది. ఆర్మూర్ నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్ కుమార్‌రెడ్డి మంజూరు చే యించిన రూ.2లక్షల ఎల్ వోసీ కాపీని గురువారం బాధితుడు గంగా ధర్‌కు అందజేశారు.



బాధితుడికి ఎల్‌వోసీ కాపీని అందజేస్తున్న దృశ్యం

బీఈడీ పరీక్షలకు 24మంది గైర్హాజరు

డిచ్‌పల్లి,ఏప్రిల్ 25: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలు, గురువారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ పరీక్షకు 412 మంది విద్యార్థులకు గాను 388 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 24 మంది గైర్హాజరయ్యారని, ఘంట చంద్రశేఖర్ తెలిపారు. బీఎడ్ పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల, కామారెడ్డి ప్రభుత్వ సైన్స్ అండ్ ఆర్ట్ కళాశాల, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ కళాశాల బాన్సువాడ, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆడిట్ సెల్ అధికారులు తెలిపారు.

'బీజేపీని చిత్తు చిత్తుగా ఓడించాలి'

సిరికొండ ఏప్రిల్ 25 : మత రాజకీయాలను తన ఎజెండాగా ఎంచుకున్న నరేంద్రమోదీ మళ్లీ గెలిస్తే ప్రజాస్వామిక వాదులు, ప్రశ్నించే గొంతుకలను జైళ్ల పాలు చేస్తారని గురువారం సిరికొండలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి మాస్‌లైన్, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు హాజరయ్యారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ దాని మిత్ర పక్షాలను చిత్తు చిత్తుగా ఓడించాలని వ్యక్తలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ కమిటీ సభ్యులు ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవీ, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ తదితరులు మాట్లాడారు.ప్రజావ్యతిరేక బీజేపీదాని మిత్ర పక్షాల ఫాసిస్టు విధానాలను తిప్పి కొట్టాలంటే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని అప్పుడే మన రాజ్యాంగాన్ని మనుధర్మ శాస్త్రం నుంచి కాపాడుకున్న వాళ్ల మవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిరికొడ పీఏసీఎస్ అధ్యక్షుడు చెల్లెం గంగాధర్,బాబన్న,కాంగ్రెస్ నాయకులు దేగం సాయన్న, చందర్, బంగ్లా నర్సారెడ్డి,మాస్‌లైన్ నాయకులు రమేష్,దామోదర్, కేవీఎస్ అధ్యక్షుడు సుమన్, సాయారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేడే 1న సెలవు దినం ప్రకటించాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25: తెలంగాణ యూనివర్సిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యంలో వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట గురువారం 138 వ మేడే పోస్టర్ లను సిబ్బంది ఆవిష్కరించారు.ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి బికోజీ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం పోరాడి ప్రపంచ వ్యాప్తంగా అనేక కార్మిక హక్కులను సాధించుకోవడం జరిగిందని, హక్కుల పోరాటంలో చికాగో కార్మికులు తమప్రాణాలను అర్పించారని నేడు పాలకులు హక్కులను కాలరాస్తు కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకొస్తున్నారని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని శ్రమ దోపిడి జరుగుతుందని, ఉద్యోగ భద్రత లేదని అన్నారు. మేడే 1 వతేదిన సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది మధులిక, సుధీర్, రవీందర్ నాయక్, రమేశ్, గంగాధర్, జమున, రాణి, పాల్గొన్నారు.

నేడు జక్రాన్‌పల్లిలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ

జక్రాన్‌పల్లి, ఏప్రిల్24: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ 15వ వేడుక సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు ఏపీవో రవి తెలిపారు. గత ఏడాదిలో అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై ఇప్పటికే గ్రామాలలో గ్రామస్థాయి సామాజిక తనిఖీలు ప్రజా వేదికలు నిర్వహించామని తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈజీఎస్ సామాజిక ప్రజా వేదిక నిర్వహిస్తున్నా మని ఈ కార్యక్రమానికి అధికారులు హాజరవుతారని అన్నారు. అన్ని గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, మెట్లు,ఉపాధి హామీ కూలీలు హాజరు కావాలని కోరారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ధర్పల్లి, ఏప్రిల్ 25:మండలంలోని దుబ్బాక గ్రామంలో ఓ యువకుడు మద్యానికి బానిసై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన గంగాధర్ (25) అనే యువకుడు ఇంట్లోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆయన తెలిపారు. రోజు కూలీ చేసుకుంటూ వచ్చిన డబ్బుతో మద్యం సేవించేవాడని కుటుంబ సభ్యులు మద్యం తాగవద్దని ఎన్నిసార్లు చెప్పిన మృతుడిలో మార్పు రాలేదని ఎస్సై తెలిపారు. దీంతో మద్యానికి బానిసై జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళపై గొడ్డలితో దాడి

ధర్పల్లి, ఏప్రిల్ 25: మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన ఒకరు గొడ్డలితో దాడి చేసి గాయపర్చినట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోపి అదే గ్రామానికి చెందిన సుగుణ కుటుంబాల మధ్య గతంలో భూమి వివాదాలు నెలకొన్నాయి. సుగుణ పేరుమీద గల భూమి తనకే చెందుతుందని గతంలో గోపి సుగుణ కుటుంబీకులపై దాడి చేసినట్లు ఎస్సై చెప్పారు. రెండు కుటుంబాల మధ్య భూవివాదంపైనే దాడికి దారి తీసిందన్నారు. ఇందులో భాగంగా గోపి, సుగుణ కుటుంబం వల్లేతనకు ఆస్తినష్టం జరిగిందంటూ గ్రామంలో గోడ ప్రతులను అతికించాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గోడ ప్రతులపై గోపిని ప్రశ్నించగా గోపి గొడ్డలితో సుగుణ, కూతురు, కొడుకుపై దాడికి యత్నించడంతో అడ్డుగా వెళ్లిన సుగుణపై దాడి చేశారని ఆయన పేర్కొన్నారు. ఈదాడిలో సుగుణ చాతి, మెడ బాగాలలో గాయాలయ్యాయని ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు.బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు చెప్పారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల కళాశాల విద్యార్థుల ఉత్తీర్ణత

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్25: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో విద్యార్థి నిలు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ పి.సవిత తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పి.రుచిత 974, బైపీసీలో ఎ.పూజశ్రీ 885 మార్కులు సాధించగా, మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ఎస్.రజిత 448, బైపీసీలో డి.గాయత్రి 424మార్కులు సాధించగా కళాశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినులను అభినందించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులకు ర్యాంకులు

● సత్తా చాటిన 'కాకతీయ' విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 : గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో జిల్లా విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి మరో సారి సత్తా చాటారు. జిల్లాకు చెందిన కాకతీయ కళాశాలల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులతో పాటు ఉత్తమ పర్సంటైల్ సాధించారు.

● కాకతీయ విద్యార్థుల హవా

జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాలలో జిల్లా కేంద్రంలోని కాకతీయ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండవ సంవత్సరం చదువుతూ ఇంటర్‌తో పాటు తొలిప్రయత్నంలోనే డైరెక్ట్‌గా ఐఐటీ జెఈఈ మెయిన్స్ పరీక్షల్లో జాతీయ ర్యాంకులను సాధించారు. కళాశాలకు చెందిన తేజస్విని 967, కేతన 1220, మినహాజ్ 1051, ఎం.సుప్రిత్ 2092, బి.శివప్రతమ్ 2910, ఎ.మాలిక్ 7167, ఎ.హదీ 7533 ర్యాంకులను సాధించారు. 17 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా పర్సంటైల్ సాధించారు. మినహాజ్ 99.68 పర్సంటైల్, ఎం.సుప్రిత్ 99.41 పర్సంటైల్, బి.శివప్రతమ్ 99.22 పర్సంటైల్, ఎ.మాలిక్ 98.30 పర్సంటైల్, ఎ.హదీ 98.22 పర్సంటైల్ సాధించినట్లు వీరు తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి ఐఐటి అడ్వాన్స్‌డ్ పరీక్షకు 50 మంది విద్యార్థులు అర్హత పొందినట్లు డైరెక్టర్ రామోజీరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను రిటైర్డ్ డీఐఈవో రఘురాజ్ అభినందించారు. ఈ సందర్భంగా ఇంతటి విజయానికి కారకులైన విద్యార్థులకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు డైరెక్టర్ తేజస్విని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ అధ్యాపక బృందం, కాకతీయ విద్యాసంస్థల ప్రిన్సిపల్ వి.రణదీశ్, సందీప్ కులకర్ణి పాల్గొన్నారు.



టాప్ ర్యాంకు సాధించిన కాకతీయ విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

● పాఠశాల స్థాయిలోనే జేఈఈ మెయిన్స్‌పై పట్టు : మినహాజ్



కాకతీయ నీట్ ఐఐటీ అకాడమీలో చదువుతూ జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. నేను పాఠశాల స్థాయిలోనే కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదవడం వల్ల నాకు జెఈఈ మెయిన్స్‌పై పట్టు సాధించగలిగాను. కెవోఎస్‌లో ఉదయం క్లాసులు, రెగ్యూలర్ సిలబస్‌పై టీచర్లతో శిక్షణ ప్రతీరోజు మధ్యాహ్నం ప్రతి సబ్జెక్టుపై ఇంటర్, ఎంసెట్ స్థాయి టీచర్లతో ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ బోధన ఉంటుంది. ఇలా పాఠశాల స్థాయిలోనే వేరువేరుగా నిపుణులైన అధ్యాపకులు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు మమ్మల్ని సిద్ధం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకోవడం ప్రణాళిక బద్ధంగా చదవడం వల్లే నేను ఈ ర్యాంకు సాధించాను.

● మేనేజ్‌మెంట్ ప్రోత్సాహం వల్లే ర్యాంకు : ఎం.సుప్రిత్



ఇంటర్ కాకతీయ కళాశాలలో ఎంపీసీ చదివాను. జెఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 2092 ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. మా డైరెక్టర్ ఐఐటిఎన్ రామోజీరావు నిరంతరం పర్యవేక్షణ అన్ని వేళలా అధ్యాపకులు అందుబాటులో ఉండి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ మమ్మల్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేశారు. ప్రణాళిక బద్ధంగా చదవడంతో పాటు ఎప్పటికప్పుడు నిర్వహించే పరీక్షల వల్ల ఎంతో లాభం జరిగింది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా : శివప్రతమ్



జాతీయ స్థాయి ఐఐటీ మెడికల్ పరీక్షకు రాణించాలంటే పాఠశాల స్థాయి నుంచే ప్రతీ సబ్జెక్టుపై అవగాహన కలిగి ఉండాలి. స్కూల్ స్థాయిలోనే కెవోఎస్ పాఠశాలలో ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌పై వంద శాతం పునాది వేశారు. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా.

నారాయణ జిల్లా విద్యార్థులకు ఆల్ ఇండియా ర్యాంకులు



టాప్ ర్యాంక్‌లు సాధించిన నారాయణ విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25: గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నారాయణవిద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి మరోసారి సత్తా చాటారు. జిల్లాకు చెందిన నారాయణ కళాశాలల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులతో పాటు ఉత్తమ పర్సంటైల్ సాధించారు. జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నగరానికి చెందిన నారాయణ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. కళాశాలకు చెందిన మర్రి హర్ష 848వ ర్యాంకు, బానోత్ సోహన్ 5908 ర్యాంకు సాధించడంతో పాటు కళాశాలకు చెందిన విద్యార్థులు 14539, 17348, 30వేల లోపు 28 మంది ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ కుంట లక్ష్మారెడ్డి తెలిపారు. మొత్తం కళాశాలకు చెందిన 28మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హతలు సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ఫలితాలలోనే కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించారని కళాశాల స్థాపించి రెండవ సంవత్సరంలోను ఇంతటి ఘనమైన ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శేఖర్, కోర్డిన్ యువి ప్రసాద్, జీఎం కాట్రగడ్డ శ్రీనివాస్‌రావు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

వెక్టర్ విద్యార్థుల ప్రతిభ



హృదయ్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 : గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో జిల్లాకు చెందిన వెక్టర్ కళాశాలల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులతో పాటు ఉత్తమ పర్సంటైల్ సాధించారు. జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నగరంలోని వినాయక్‌నగర్ లోగల వెక్టర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారు. కళాశాలకు చెందిన విద్యార్థులు దారం హృదయ్ 98.76 పర్సంటైల్, బత్తుల సహర్ష 94.33 పర్సంటైల్, సాయిదుర్గ 94.20 పర్సంటైల్ సాధించడంతో పాటు 17 మంది విద్యార్థులు జెఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని కళాశాల చైర్మన్ మధుసూదన్ జోషి తెలిపారు. సాధారణ స్థాయిలో పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థుల చేత అత్యుత్తమ ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని పట్టుదల, అంకితభావంతో కృషి చేసిన విద్యార్థులకు, అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గజానన్ సంతోష్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 : గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఎస్ఆర్ విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి మరోసారి సత్తా చాటారు. ఎస్ఆర్ కళాశాలల విద్యార్థులు ఈసారి కూడా జాతీయ స్థాయి ర్యాంకులతో పాటు అత్యుత్తమ పర్సంటైల్ సాధించారు.

» జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన ఎస్ఆర్ విద్యార్థులు

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నగరంలోని ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు వివిధ కేటగిరిలలో జాతీయ స్థాయి ర్యాంకులను సాధించారు. కళాశాలకు చెందిన ఆంగోతు నందిని జాతీయ స్థాయిలో 12వ ర్యాంకు (ఎస్టీ కేటగిరి), రాథోడ్ ప్రవీణ్‌కుమార్ 1514 (ఎస్టీ కేటగిరి), కర్క శ్రేయేస్ కుమార్ 5047 (ఓబీసీ కేటగిరి), తలారి రిషిరాజ్ (ఎస్సీ కేటగిరి), అనాస వంశీ కృష్ణ 8123 (ఎస్సీ కేటగిరి), మొదల శ్రీవల్లి 9361 (జనరల్ కేటగిరి), కె.భవ్య 9745 (ఓసీ కేటగిరి), ఆర్.అక్షయ్‌రెడ్డి 11322 (ఓసీ కేటగిరి) ర్యాంకులను సాధించారు. ఇలా వివిధ కేటగిరిలో ఆరుగురు 20వేల లోపు, 66మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్లు డీజీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనుభవజ్ఞులైన ఎస్ఆర్ అధ్యాపకులు, కరిక్యులమ్, మెటిరియల్స్, ఎగ్జామినేషన్ సిస్టమ్ ద్వారా ఐఐటి ప్రోగ్రామ్స్‌లలో ఫోకస్ బ్యాచ్ మరియు స్పార్క్ బ్యాచ్‌ల ద్వారా విద్యార్థులను జాతీయ స్థాయి పరీక్షలైన నీట్, ఐఐటీలకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ప్రదీప్‌రెడ్డి, జోనల్ ఇంచార్జి శ్రీకాంత్, ప్రిన్సిపాల్స్ హన్మంత్‌రావు, మహిపాల్‌రెడ్డి, అగేందర్‌రెడ్డి, సత్యం, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ఐఏఎస్ ఆఫీసర్‌ను అవుతా.. : నందిని



ఐఐటీ, జేఈఈ మెయిన్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో 12వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. నేను రైతు కుటుంబం నుంచి వచ్చాను. కష్టపడి చదవడంతో పాటు ఎస్ఆర్ మేనేజ్‌మెంట్ ప్రోత్సాహం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనతో ఈ ర్యాంకు సాధించాను. భవిష్యత్తులో ఐఏఎస్ ఆఫీసర్‌ను అవుతా.

● సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా : రాథోడ్ ప్రవీణ్‌కుమార్



భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనేది నా కల. అందులో భాగంగానే జేఈఈ మెయిన్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో 1514 ర్యాంకు సాధించాను. ఎస్ఆర్ మేనేజ్‌మెంట్ నిరంతర పర్యవేక్షణ, మెటీరియల్స్ పరీక్షల టైమ్‌టేబుల్ నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ ర్యాంకు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులకు నా ధన్యవాదాలు.



టాప్ ర్యాంక్ సాధించిన ఎస్ఆర్ విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

జిల్లా అంతటా అవగాహన ర్యాలీలు



పెర్కిట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్25: ఆర్మూర్ మండలం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ మలేరియా బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియ జ్వరం ఇనఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని, మురికినీటిలో చెత్తచెదరంలో ఈ దోమలు వృద్ధి చెందు తాయన్నారు. ఈ కార్యక్ర మంలో వైద్యాధికారిణి డాక్టర్ మానస, వైద్యసిబ్బంది సాయి, అనవాల, రవి, గణేష్, తదిత రులు పాల్గొన్నారు.

కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కరణ్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సిరికొండలో గురువారం వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా వుండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ అరవింద్ ప్రజలను కోరారు. ఈ ర్యాలీలో సీహెచ్‌వో అనంతరావు,పర్యవేక్షకులు,సిబ్బంది పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: దోమల బెడద ద్వార వచ్చే మలేరియ వ్యాధిన సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే వ్యాధినుంచి బయటపడవచ్చని ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్ అనిత, ఆరోగ్య కార్య కర్తలు వెంకట్‌రెడ్డి, ఆనంద్, శారద, ఇందిరా, ఉదయ,రాధిక, అరుంధతి, భానుప్రియ, స్వరూప, మమత, సంతోషి, విజయ, సావిత్రి, దేవి మేరి, రేణుక, కావ్య, గంగుబాయి పాల్గొన్నారు.

ఇందల్వాయి: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తీర్ణ అధికారి శంకర్ మాట్లా డుతూ సమానమైన ప్రపంచం కోసం మలేరియా పై పోరాటాన్ని వేగ వంతం చేయండి అని అన్నారు. గ్రామంలోని వీధులన్నీ శుభ్రంగా ఉంచి మురు గు కాలువలో చెత్తా చెదారం లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్య క్ర మంలో ల్యాబ్ టెక్నీషియన్ అనిత, ఆరోగ్య కార్యకర్తలు వెంకట్‌రెడ్డి, ఆనంద్, ఉదయ, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్‌వైజర్ సాయమ్మ, శ్రీను, ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: రాబోయే 2030లోగా మలేరియా వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలని నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రేమలత, సూపర్‌వైజర్ కిషన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మెడికోలు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మలేరియా నివారణ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మారుతీ గౌడ్, పండరి, కల్పన, ఆశ వర్కల్‌లు పాల్గొన్నారు.

రుద్రూరు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా రుద్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారిణి డాక్టర్ అయేషా సిద్ధిఖా ఆధ్వర్యంలో ఆసుపత్రి నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో డి.రాజేందర్, సూపర్ వైజర్లు రవి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు, ప్రజలు పాల్గొన్నారు.

ధర్పలి: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ధర్పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శశిధర్, హెల్త్‌సూపర్‌వైజర్ రాజేందర్, నారాయణ, మేరి, నిర్మల, మురళి, వాజిద్, నరేందర్, మిన్న, తదితరులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని ప్రతీ ఒక్కరు ఆచరించాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్25: దేశ సంస్కృతిని ప్రతి ఒక్కరు ఆచరించాలని శ్రీ బ్రహ్మ సదా శివ మహంత్ శివాచార్య స్వామిజీ అన్నారు. పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో కొనసాగుతున్న శివనామ సప్తాహంలో ప్రజలకు ప్రవచనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజల అనంతరం భక్తులు భజనలు, కీర్తనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందని ఆయన సూచించారు. సృష్టిలో సమస్త జీవరాశుల్లో మానవ జన్మ చాలా శ్రేష్టమైనదని సూచించారు. ప్రజలు నిత్యం శివనామ స్మరణ చేస్తే సకలశుభాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు గంగాధరప్ప, శంకరప్ప, విఠలప్ప, సుంకిని శివ, దిలీప్ కుమార్, అజయ్ కుమార్, శివ కుమార్, గణపతి అప్ప, నాగనాథ్ పటేల్, శివలింగాప్ప, నితిన్ పటేల్, వీరశైవ భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఠాణాకలాన్ విద్యార్థికి రాష్ట్ర ర్యాంక్

ఎడపల్లి, ఏప్రిల్ 25: ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామానికి చెందిన సాయి అంజన్ అనే విద్యార్థి ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధిం చారు. అంజన్‌గౌడ్ తండ్రి నిజామాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తుండగా, అతని తల్లి స్వప్న మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో సెకండ్ ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ధర్మారం గురుకుల విద్యార్థుల ప్రతిభ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25: ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు జేఈఈమెయిన్స్ ఫైనల్ ఫలితా ల్లో మంచి ప్రతిభ చాటారని గురుకుల కళా శాల ప్రిన్సిపాల్ సంగీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల నుంచి 15 మంది విద్యార్థినులు జేఈఈ అడ్వాన్స్‌కు అ ర్హత సాధించారని తెలిపారు. వర్ష(92.44), తేజశ్రీ(90.87), కృతజ్ఞ(86.76), సంధ్య (85.71), అపూర్వ(79.46)లతో ప్రతిభ కన బర్చారని సంగీత తెలిపారు. ఈ విద్యార్థినులను ఉపాధ్యాయులు సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ఇందల్వాయి, ఏప్రిల్ 25:గురువారం ఎంపీపీ రమేష్‌నాయక్ అధ్యతక్షన జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడిందని ఎంపీడీవో అనంత్‌రావు తెలిపారు. ఈనెల 25వ తేదీన నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు ఎవరూ రాకపోవడంతో సమావేశాన్ని నిర్వహించలేదు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

బోధన్‌రూరల్,ఏప్రిల్25: జిల్లా కేంద్రానికి చెందిన మనోభాయ్ అనే వ్యక్తి బోధన్‌లో నివాసం ఉంటూ జిల్లా కేంద్రంలో గ్యాస్ ఏజెన్సీలో విధులు నిర్వహించడానికి ఈ నెల 22వ తేదిన వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని భార్య సుకన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్య తెలిపారు. మనోభాయ్ భార్యపిల్లలతో బోధన్ పట్టణంలో నివాసం ఉంటున్నాడని, అతడు జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి అదృశ్యమైన వ్యక్తిని కుటుంబ షభ్యులకు అప్పగిస్తామని తెలిపారు.

ఆర్ఎస్ఈటీఐ లో శిక్షణ ద్వారా యువతకు చక్కని ఉపాధి

● ఎస్‌బీఐ స్టేట్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25: స్టేట్ బ్యాంగ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి కేంద్రంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఎస్‌బీఐ స్టేట్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన శిక్షణ కేంద్రాన్ని కలియ తిరుగుతూ అభ్యర్థులకు అందుతున్న శిక్షణ ను పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణార్థులను ఉద్దేశించి శివనాథరెడ్డి మాట్లాడుతూ... ఆర్ఎస్ఈటీఐ చాలా మంచి నాణ్యమైన శిక్షణాలు అందిస్తున్నారని ఇక్కడ నేర్చుకున్న శిక్షణ ద్వార చాలా మంది నిరుద్యోగులు ఆయా రంగాల్లో వారి నైపుణ్యతతో స్థిరపడ్డారని అన్నారు. ప్రస్తుత రోజుల్లో మగ్గం వర్క్, టైలరింగ్ కు మంచి డిమాండ్ ఉందని అభ్యర్థులు చక్కగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మీ, రామకృష్ణ, రంజిత్, నవీన్, శ్రీలత, పరీధ, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,700	రూ.66,800	రూ.850

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : రత్నం (11.30, 2.45, 6.00, 9.15)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (1.25, 7.10)
: మంజుమ్మల్ బాయ్స్ (4.05)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (10.05)
స్క్రీన్-3 : మంజుమ్మల్ బాయ్స్ (1.00)
: టిల్లు స్క్వేర్ (4.00, 10.35)
: ది ఫ్యామిలీస్టార్ (7.10)
స్క్రీన్-4 : ది ఫ్యామిలీస్టార్ (1.10)
: కొంచెం హాట్‌కే (తెలుగు) (4.35)
: మంజుమ్మల్ బాయ్స్ (7.15, 10.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : రత్నం (1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : టిల్లు స్క్వేర్ (1.40)
: మంజుమ్మల్ బాయ్స్ (4.40, 10.30)
: కొంచెం హాట్‌కే (తెలుగు) (7.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : హ్యాపిడేస్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : రత్నం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్